క్లుప్తంగా

మోదకొండమ్మ ఆలయంలో శ్రావణం పూజలు


ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో శ్రావణం తొలి ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం పండగ వాతావరణం సంతరించుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రైతుల మోటారు వైర్ల చోరీ

బుచ్చెయ్యపేట : మండల కేంద్రం బుచ్చెయ్యపేట పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు రైతుల వ్యవసాయ మోటార్ల సర్వీస్ వైర్లు కత్తిరించి పట్టుకుపోయారు. శనివారం రాత్రి బుచ్చెయ్యపేటలో 8 మంది, ఐయితంపూడిలో ఇద్దరు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల సర్వీస్ వైర్లను కత్తిరించి అందులో ఉన్న కాపర్ వైర్లు దొంగిలించారు. బుచ్చెయ్యపేటకు చెందిన కొందరు యువకులు కత్తిరించిన వైర్లను కాల్చి అందులో ఉన్న కాపర్ వైరు అమ్ముతుండగా కొందరు గ్రామస్తులు పట్టుకున్నారు. వారిని పోలీసులకు అప్పగించడానికి చూడగా గ్రామ పెద్దలు రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు.

నూకాలతల్లి విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన నూకాలతల్లి విగ్రహం

రోలుగుంట : మండలం ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన నూకాలతల్లి ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నూకాలతల్లి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. గ్రామ ఇలవేల్పుగా కొలుస్తున్న అమ్మవారి విగ్రహం ధ్వంసమై ఉండటాన్ని ఆదివారం ప్రజలు గమనించి ఆవేదనకు లోనయ్యారు. ఈ ఘటనపై ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

జీవామృతం వినియోగంపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ దేవి

రోలుగుంట : మండలం కొంతలం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జీవామృతం, నీమాస్త్రం వినియోగంపై ఆ శాఖ మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి అవగాహన సదస్సు నిర్వహించారు. రైతుల పొలాల వద్ద ముందుగా సమకూర్చిన రంగుల కవర్లతో అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా కాంప్లెక్ట్ బ్లాక్‌లో ఎనిమిది మంది రైతులతో జీవామృతం, నీమాస్త్రం 200 లీటర్లు పట్టే కవర్లతో తయారు చేయించారు. అలాగే రైతుల సొంత పొలాల్లో బంతి, వంగ నారు వేయించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దివంగత ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి


రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కొండలరావు

మాడుగుల రూరల్ : దేశంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగేందుకు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఎన్నో సంస్కరణలు అమలు చేసినట్లు మాడుగుల నియోజకవర్గ కోఆర్డినేటర్ పడాల కొండలరావు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. యువతకు 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌కే దక్కుతుందని కొండలరావు అన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి రాజు, పుట్టా గుప్తాజీ, ఏసురాజు, బాలిబోయిన అప్పారావు, దంగేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పరవళ్లు


ప్రధాన రోడ్డు, డ్రైనేజీలు నిర్మిస్తున్న దృశ్యం


గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేసిన దృశ్యం

- పలు నిర్మాణాలతో జంపెన గ్రామానికి సరికొత్త అందాలు
- ఇంటింటి కుళాయిలకు రూ. 72 లక్షలు మంజూరు
- రూ. 15 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం

మాడుగుల : గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని చాటి చెప్పిన బాపూజీ కలలు నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామాల్లోనే అందిస్తున్నారు. అభివృద్ధి పనులతో గ్రామాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. అందులో భాగంగా మండలంలోని జంపెన గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. జంపెన అందమైన చిన్న పల్లెటూరు. ఇరువైపుల పెద్దేరు నది, మరోవైపు అందమైన పొలాలతో గ్రామం పచ్చగా కళకళలాడుతుంది. ఇప్పుడు అభివృద్ధి జరుగుతుండడంతో గ్రామం చూడముచ్చటగా తయారవుతోంది. గ్రామంలో సుమారు 1600 మంది ప్రజలు నివాసముంటున్నారు. రూ. 15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. రూ. 12 లక్షలతో సీసీ డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. నాడు–నేడులో భాగంగా రూ. 16 లక్షలతో ఇక్కడి పాఠశాలల రూపురేఖలు మార్పు చేశారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలుకు మరో రూ. 5 లక్షల నిధులు మంజూరు చేశారు. తాజాగా గ్రామంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి రూ. 72 లక్షలు మంజూరు కావడంతో త్వరలో పనులు ప్రారంభించనున్నారు. అలాగే జగనన్న కాలనీ మంజూరు కావడంతో ఇల్లు లేని నిరుపేదలు ప్రభుత్వ సహకారంతో సొంతింటివారు కానున్నారు. అలాగే గ్రామం మధ్యలో నుంచి ప్రధాన డ్రైనేజీలతో పాటు వెడల్పాటి రహదారి నిర్మాణం జరుగుతుండడంతో తమ గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటాం



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామం అభివృద్ధికి సహకరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు రుణపడి ఉంటాం. సీసీ డ్రైనేజీలు నిర్మాణం జరగడంతో గ్రామం పరిశుభ్రంగా దర్శనమిస్తోంది. శిథిలమైన గ్రామ ప్రధాన రహదారి నిర్మాణం చేపడుతున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– పెచ్చేటి అచ్చుంనాయుడు, గ్రామస్తుడు, జంపెన

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో ఇప్పటికే గ్రామం రూపురేఖల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. రానున్న కాలంలో ఆయన సహకారంతో పూర్తి స్థాయిలో డ్రైనేజీలతో పాటు మిగిలిపోయిన సీసీ రోడ్లు పూర్తి చేసి ఆదర్శ గ్రామంగా తయారు చేయడానికి కృషి చేస్తున్నాం.

– నేమాల గురువునాయుడు, సర్పంచ్, జంపెన

‘వార్డుల్లో’ వైఎస్సార్‌సీపీ సత్తా

పంచాయతీలు, వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటింది. సర్పంచ్ స్థానాలతో పాటు వార్డు సభ్యుల స్థానాల్లోనూ గెలుపొంది ప్రత్యర్థి టీడీపీని మట్టి కరిపించింది. ఈ ఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ ఏకమైనా వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థుల విజయాన్ని అడ్డుకోలేకపోయాయి. ప్రతిష్టాత్మకంగా మారిన ఈ ఎన్నికల్లో బెట్టింగ్‌లు కూడా జోరుగా జరిగాయి. పకడ్బందీ చర్యలతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.


తరుంబోయిన రాజేశ్వరి


బండారు కిశోర్‌కుమార్


ఆదిరెడ్డి సన్యాసమ్మ


కాకర ప్రసాద్


కంఠముఖి జానకి

గొలుగొండ : గాదంపాలెం గ్రామంలో రెండవ వార్డు మెంబర్‌గా పోటీ చేసిన తరుంబోయిన రాజేశ్వరి మూడు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి రాజేశ్వరి సమీప టీడీపీ మద్దతు అభ్యర్థి కొండమ్మపై 3 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ వార్డులో 87 ఓట్లకు గాను 67 ఓట్లు పోలయ్యాయి. రాజేశ్వరికి 35, కొండమ్మకు 32 ఓట్లు రావడంతో రాజేశ్వరి గెలిచినట్లు ఎన్నికల అధికారి సీతామహాలక్ష్మి ప్రకటించారు.

మాడుగుల నియోజకవర్గంలో..

మాడుగుల : నియోజకవర్గంలో ఆరుగురు వార్డు మెంబర్లు ఏకగ్రీవం కాగా వారిలో నలుగురు వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులున్నారు. కె.కోటపాడు మండలం ఆర్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన 6వ వార్డు మెంబరుగా బండారు కిశోర్ కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. దేవరాపల్లి మండలంలో ఎన్.గజపతి నగరంలో 3వ వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఆదిరెడ్డి సన్యాసమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీడికాడ మండలంలో పెదగోగాడ గ్రామంలో 3వ వార్డుకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన పైలా క్రిష్ణవేణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అప్పలరాజుపురం గ్రామం 9 వ వార్డుకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన కాకర ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వార్డు మెంబర్లు ఏకగ్రీవం..

రావికమతం : మండలంలో కవగుంట, తట్టబంద పంచాయతీ వార్డు మెంబర్లుగా వైఎస్ఆర్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కవగుంట 2వ వార్డు మెంబర్‌గా కంఠముఖి జానకి, తట్టబంద 8వ వార్డు మెంబర్‌గా నమ్మి నాగమణి ఏకగ్రీవం అయ్యారు. కవగుంట 2వ వార్డు మెంబరు కంఠముఖి శ్రీనివాసరావు అప్పట్లో కరోనాతో మృతి చెందగా, తట్టబంద వార్డు మెంబర్ అప్పలనాయుడు గుండెపోటుతో మరణించారు. దీంతో ఇప్పుడు జరిగిన ఎన్నికలో జానకి, నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి చైతన్య తెలిపారు.

నూరు శాతం సర్వే పూర్తి చేయాలి


మాట్లాడుతున్న నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్

నాతవరం : నేటితో ఇంటింటి ఓటరు సర్వే ముగుస్తున్నందున ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం శత శాతం సర్వే పూర్తి చేయాలని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్ అన్నారు. ఆదివారం పోలింగ్ బూత్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాల్లో అధిక శాతం బూత్ అధికారులు నిబంధనల ప్రకారం సర్వే చేశారని, కొందరు మాత్రం ఆశించిన మేర సర్వే చేయలేదన్నారు. ఓటర్ల సర్వే పూర్తి చేశాక జగనన్న భూ రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా రీసర్వే జరగాలన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇంత వరకు రీసర్వే మొదట, రెండవ విడత కలిపి 150 రెవెన్యూ గ్రామాల్లో లక్షా 50 వేల సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్ నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ చైస్లు, సీనియర్ అసిస్టెంట్ డి. కృష్ణ, వీఆర్వోలు, పోలింగ్ బూత్ అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా స్వామిత్ర సర్వే


చినసందిపల్లిలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సంతోషి నళిని

దేవరాపల్లి : జగనన్న భూ హక్కు భూరక్ష, స్వామిత్ర సర్వే మండలంలోని నాలుగు గ్రామాల్లో పారదర్శకంగా జరుగుతుందని మండల ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని తెలిపారు. ఈ మేరకు మండలంలోని తామరబ్బ, చినసందిపల్లి, శివరామ చేనులపాలెం, చినసందిపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆమె ఆదివారం పర్యవేక్షించారు. జగనన్న భూ హక్కు భూ రక్ష పథకం, స్వామిత్ర సర్వేలో భాగంగా గ్రామ స్థాయిలో వ్యవసాయ భూముల మాదిరిగా ఇళ్లు, నివాస స్థలాలు, గ్రామ కంఠ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలను సర్వే చేసి సదరు యజమానికి ప్రాపర్టీ కార్డు (ఆస్తి గుర్తింపు కార్డు) అందజేస్తామన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని సంతోషి నళిని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్ష చేస్తున్న అంజు ఆస్పత్రి వైద్యురాలు తేజ


స్వయంభూ విఘ్నేశ్వరాలయం వద్ద కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

నాతవరం : పేదలకు వైద్య సేవలందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఆనందదాయకమని చెర్లోపాలెం సర్పంచ్ పైల శిరీష అన్నారు. ఆదివారం కాకినాడకు చెందిన అంజు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 159 మంది రోగులను పరీక్షించగా అందులో 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. మరి కొందరికి కంటి అద్దాలు వేసుకోవాలని సూచించారు. రోగులకు ఉచితంగా మందులిచ్చి, కంటి అద్దాలు అందజేస్తామని వైద్యులు తెలిపారు. అనంతరం కంటి రక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కంటి ఆపరేషన్లు చేయించుకునే వారిని అంజు కంటి ఆస్పత్రికి చెందిన ప్రత్యేక వాహనంలో కాకినాడ సర్పంచ్ దగ్గరుండి పంపించారు. ఆపరేషన్ పూర్తయి ఇంటికి వచ్చే వరకు మందులు, రవాణా ఖర్చులు అంజు కంటి ఆస్పత్రే భరిస్తుందని వైద్యులు తేజ, శ్రద్ధ తెలిపారు. శిబిరం నిర్వహణకు సర్పంచ్ శిరీషతో పాటు నర్సీపట్నం యూనియన్ బ్యాంకు మేనేజర్ పైల మాతినాయుడు (నాని) సహకరించారు. మాజీ సర్పంచ్ మాకిరెడ్డి వెంకటరమణ, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సకు 33 మంది ఎంపిక

- వివిధ రకాల చికిత్సలకు మరో ఏడుగురు

చోడవరం రూరల్ : వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 33 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. మరో ఏడుగురికి వివిధ రకాల కంటి చికిత్సలు చేయాల్సి ఉందని, వీరందరినీ విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖ శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 118 మంది కంటి రోగులు హాజరయ్యారు. వీరందరికీ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరి చందన, కో ఆర్డినేటర్ ఎం.అరుణ్‌కుమార్, సతీష్, చోడవరం ప్రభుత్వ ఆస్పత్రి కంటి వెలుగు ఆప్తాల్మిక్ ఆఫీసర్ నాగలక్ష్మి కంటి పరీక్షలు జరిపారు. నర్సింగ్ స్టాఫ్ రేణుక, వైద్య సిబ్బంది శిబిర నిర్వహణలో సహకరించారు. 33 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉందని, కంటి నరాల చికిత్స కోసం ఇద్దరిని, కంటి నీటి కాసుల చికిత్స కోసం మరో ఇద్దరిని, కంటిపై పొర చికిత్స కోసం, చిన్నపిల్లల కంటి చికిత్సకు, కనురెప్పల చికిత్సకు ఒక్కొక్కరిని విశాఖలోని శంకర్ కంటి ఆస్పత్రి స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణకు ఎంపిక చేశారు. వీరందరిని ప్రత్యేక బస్సులో విశాఖ ఆస్పత్రికి తరలించారు.

ఐక్యతతోనే చేనేత కార్మికులకు న్యాయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజారావు

రావికమతం : చేనేత కార్మికులంతా సంఘటితం కావాల్సిన సమయం ఆసన్నమైందని చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు అన్నారు. సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం రావికమతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న చేనేత కార్మికులకు తగిన న్యాయం జరగాలంటే చైతన్యం అవసరమన్నారు. రాజకీయంగానూ ఎదగాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి ఆగస్టు 27న తలపెట్టిన చలో గాజువాక సభను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర డైరెక్టర్లు పప్పు వెంకటరమణ, దొడ్డి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు, కార్యవర్గ సభ్యుడు ఆనందప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ మెంబర్‌గా ఖాసిమ్



కె.కోటపాడు: అనకాపల్లి జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ మెంబర్‌గా కె.కోటపాడు అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే ఖాసిమ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ నుంచి ఆదివారం ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఖాసిమ్ నియామకం పట్ల అపుస్మా రాష్ట్ర కోశాధికారి ఎంవీ రావు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అపుస్మా అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, నల్లపురెడ్డి సీతారామరాజు హర్షం వ్యక్తం చేశారు. డీసీఈబీ బోర్డు డైరెక్టర్‌గా స్థానం కల్పించిన డీఈవో వెంకట లక్ష్మమ్మకు ఖాసిమ్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా మొండిగెడ్డ వంతెన


సింగన్నదొరపాలెం సమీపంలో రక్షణ గోడలు లేని వంతెన

కె.కోటపాడు : సింగన్నదొరపాలెం గ్రామ సమీపంలో గల మొండి గెడ్డ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెనకు ఇరువైపులా ఉండే రక్షణ గోడలు శిథిలమయ్యాయి. దీంతో వాహనాలపై ఎదురెదురుగా ప్రయాణాలు చేసేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెనకు రెండు వైపులా పల్లపు ప్రాంతాలు ఉండటంతో ప్రమాదాల సమయంలో ప్రాణాపాయ పరిస్థితులు చోటు చేసుకోవడం పట్ల వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. వంతెనకు రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఆహ్లాదం పంచే పచ్చతోరణం


దేవరాపల్లి వయా చేనులపాలెం, పెదనందిపల్లి కాలనీ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు

- అద్దంలా మెరిసే రోడ్లకు ఇరువైపుల మొక్కల సమాహారం
- దేవరాపల్లి కాలేజీ నుంచి పెదనందిపల్లి కాలనీ వరకు మొక్కలు నాటిన అటవీశాఖ అధికారులు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి శివరామ చేనులపాలెం మీదుగా పెదనందిపల్లి కాలనీ వరకు ఇటీవల నూతనంగా నిర్మించిన తారురోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాలతో అటవీశాఖ అధికారులు సుమారు 3 కిలోమీటర్ల మేర బాదం, కానుగు, గంగిరావి, దేవకాంచన తదితర రకాల మొక్కలు నాటి వాటికి రక్షణగా ఆకుపచ్చని మ్యాటీలు సైతం ఏర్పాటు చేశారు. బురదమయంగా ఉన్న ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చడంతో అద్దంలా దర్శనమిస్తోంది. తాజాగా ఈ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడంతో కనుచూపు మేర హరిత తోరణం మాదిరిగా కనువిందు చేస్తోంది. ఈ రహదారిలో పచ్చదనం పరుచుకోవడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించే ప్రజలు ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా ఒకవైపు యజ్ఞంలా రోడ్లు నిర్మిస్తూ మరో పక్క రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

తెలుగుకు వెలుగునిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్: మాతృభాష కన్నతల్లితో సమానమని, ఇతర భాషలు నేర్చుకుంటూనే తెలుగుభాష ప్రాముఖ్యతకు కృషి చేయాలని రామ్‌కీ ఫౌండేషన్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.శ్రీకాంత్ అన్నారు. స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో తెలుగు భాషా పరిరక్షణ సమితి, రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుకు వెలుగునిద్దాం పేరిట ఇతర రాష్ట్రాల్లో వారి ప్రాంతీయ భాషల్లో దుకాణాల బోర్డులు పెట్టినట్లే, మన రాష్ట్రంలో కూడా వ్యాపారస్తులందరూ తమ దుకాణాల ముందు తెలుగులో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలుగు నేలలో జన్మించిన ప్రతి ఒక్కరూ మహా భారతంపై పఠనాసక్తిని పెంచుకోవాలన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ప్రతినిధులు కె.రామ్మోహన్‌రావు, జి.రంగబాబులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు తెలుగుభాష గొప్పదనాన్ని గుర్తించాయన్నారు., నేటి సమాజంలో పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు మహాభారతం, రామాయణం చదివేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులకు మహాభారతంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. 27న వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పి.అమరజ్యోతి, కోరాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ


క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందిస్తున్న చందు

మునగపాక: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం పంచాయతీ పరిధిలోని యువతకు ఆయన ఆదివారం క్రికెట్ కిట్లు అందజేశారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను కూడా ప్రోత్సహించాలని సూచించారు.

పీహెచ్‌సీలో ప్రసవాలతో తల్లీబిడ్డా క్షేమం


తల్లీ బిడ్డతో డాక్టర్ వెంకటేష్, వైద్య సిబ్బంది

రాంబిల్లి: పీహెచ్‌సీలో ప్రసవాలతో తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని దిమిలి పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆదివారం ప్రసవం జరిగింది. దిమిలి గ్రామానికి చెందిన భవాని ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ప్రసవాన్ని డాక్టర్ వెంకటేష్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది నిర్వహించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యాధికారి తెలిపారు. తమ పీహెచ్‌సీలో ప్రసవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా ప్రసవాలతో పాటు అవసరమైన అన్ని మందులు అందిస్తున్నట్లు తెలిపారు.

దోమల నియంత్రణతో వ్యాధుల నుంచి రక్షణ

ఎస్.రాయవరం: దోమల వృద్ధితో రోగాల వ్యాప్తి పెరుగుతుందని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.వాసంతి హెచ్చరించారు. పీహెచ్‌సీలో ఆదివారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులను అరికట్టేందుకు దోమల నియంత్రణే ఉత్తమ మార్గం అన్నారు. వ్యాధులకు మూల కారణమైన ప్లాస్మోడియం అనే పరాన్నజీవిని 1897 ఆగస్టు 20న సర్ రోనాల్డ్‌రాస్ కనుగొన్నారని, అందుకు గుర్తుగా ఈ రోజును దోమల దినోత్సవంగా ప్రపంచమంతా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు సుజాత, ఆరోగ్య విస్తరణాధికారి బి.సత్యనారాయణ, పీవీఎస్ ప్రసాద్, సచివాలయం హెల్త్ సెక్రటరీ పి.రాములు, ఎస్.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. ప్రపంచ దోమల దినోత్సవంలో భాగంగా ఆదివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నియంత్రణతోనే చాలా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కాలువల్లో, ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. ర్యాలీలో సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమామహేష్, వీఎస్‌ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు సంతోషి, భవాని, ఏఎన్‌ఎంలు జయశ్రీ, దేవకి, రేవతి తదితరులు పాల్గొన్నారు.